క్లుప్తంగా...

మంచినీటి సమస్య.. నేడు ధర్నా

రాజేంద్రనగర్: ప్రజల మంచినీటి ఇబ్బందులను పరిష్కరించేందుకు మంగళవారం రాజేంద్రనగర్ జలమండలి కార్యాలయం ముందు ధర్నా నిర్వహిస్తున్నట్లు అత్తాపూర్ డివిజన్ కార్పొరేటర్ మొంద్ర సంగీతగౌరీశంకర్ తెలిపారు. సోమవారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ డివిజన్ పరిధిలో మంచినీరు తక్కువగా సరఫరా అవుతుందన్నారు. ఎండాకాలం నీటి ఎద్దడి తీవ్రంగా ఉందన్నారు. జలమండలి అధికారులకు పలుమార్లు ఫిర్యాదులు చేసినా పట్టించుకోవడం లేదన్నారు. దీంతో మంగళవారం ఉదయం రాజేంద్రనగర్ జలమండలి కార్యాలయం వద్ద జరిగే ధర్నాకు అందరూ పాల్గొనాలని పిలుపునిచ్చారు.

ఉమ్రా బయలుదేరిన యాత్రికులు



శంషాబాద్: తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్నాటక రాష్ట్రాలకు చెందిన ఉమ్రా యాత్రికులు సోమవారం ఉదయం శంషాబాద్ విమానాశ్రయం నుంచి బయలుదేరి వెళ్లారు. అల్‌మిజాన్ నిర్వాహకుల ఆధ్వర్యంలో పదిహేను రోజుల యాత్రకు బయలుదేరిన వారికి కుటుంబసభ్యులు, బంధువులు శుభాకాంక్షలు తెలిపారు.

కిరణ్‌కుమార్‌కు సన్మానం



శంషాబాద్ రూరల్: రాజేంద్రనగర్ మెట్రోపాలిటన్ కోర్టు బార్ అసోసియేషన్ లైబ్రరీ సెక్రటరీగా నియమితులైన కె.కిరణ్‌కుమార్‌ను ఇండియన్ లీగల్ అడ్వకేట్ ప్రొఫెషనల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సన్మానం చేశారు. డాక్టర్ అంబేద్కర్, మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని నగరంలోని సమతాభవన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో కిరణ్‌కుమార్‌ను సన్మానించారు. కార్యక్రమంలో హైకోర్టు జడ్జి జస్టిస్ సూరేపల్లి నంద, డా.బీఆర్.అంబేద్కర్ యూనివర్సిటీ డైరెక్టర్ సుధారాణి తదితరులు పాల్గొన్నారు.

సీబీఐటీలో ఓటరు నమోదు



ఓటరుగా నమోదు చేసుకుంటున్న విద్యార్థులు

మణికొండ: ఓటరు జాబితాలో సవరణలు, కొత్త ఓటరు నమోదును గండిపేటలోని చైతన్య భారతి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(సీబీఐటీ) కళాశాల ఎన్నికల అక్షరాస్యత క్లబ్ ఆధ్వర్యంలో సోమవారం చేపట్టారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ పి.రవీందర్‌రెడ్డి మాట్లాడుతూ జనవరి 1వ తేదీకి 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరు ఓటరుగా నమోదు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో అక్షరాస్యత క్లబ్ కన్వీనర్ డాక్టర్ జీఎస్‌ఆర్ ప్రసాద్, విద్యార్థి అధ్యక్షుడు భానుప్రసాద్ పాల్గొన్నారు.

లైంగిక వేధింపులపై అవగాహన

రాజేంద్రనగర్: శివరాంపల్లిలోని తలసేమియా సికిల్ సెల్ సొసైటీలో పిల్లల లైంగిక వేధింపులపై ఇంటరాక్టివ్ సెషన్‌ను యంగ్ ఇండియన్స్ (వైఐ-మాసూమ్) టీమ్ నిర్వహించింది. ఈ సెషన్‌లో టీమ్ సభ్యురాలు పూజా లాల్వానీ, టీఎస్‌సీఎస్ ఈసీవో డాక్టర్ సుమన్ జైన్, డాక్టర్ సరోజ, అనిత తదితరులు పాల్గొన్నారు. గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై పిల్లలకు వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. పిల్లలపై లైంగిక వేధింపులకు పాల్పడితే రిపోర్ట్ చేయాలన్నారు. పిల్లలపై లైంగిక వేధింపులకు సంబంధించిన ఏదైనా సంఘటనలు జరిగితే వెంటనే చెప్పేలా పిల్లలకు అర్థం అయ్యే విధంగా వివరించారు. హెల్ప్‌లైన్ నంబర్ 1098లో స్పందించాలని కోరారు. కార్యక్రమంలో యంగ్ ఇండియన్స్, టీఎస్‌సీఎస్ సంస్థల సభ్యులు, పిల్లలు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నేటితో నేషనల్ సిల్క్ ఎక్స్‌పో ఆఖరు

మాదాపూర్: శిల్పకళావేదికలో ఏర్పాటు చేసిన నేషనల్ సిల్క్ ఎక్స్‌పో నేటితో ముగియనుంది. కాగా ఈ ప్రదర్శనలో దేశంలోని 80కి పైగా మాస్టర్ వీవర్స్, ఉత్తమ డిజైనర్స్ రూపొందించిన వస్త్రాలు అందుబాటులో ఉన్నాయి. డిజైనర్, ఎత్నిక్, వెస్ట్రన్‌వేర్, ఫ్యాషన్ జువెలరీ, లినెన్ ఉత్పత్తులు అందుబాటులో ఉన్నాయని నిర్వాహకులు జయేష్ తెలిపారు.



జలమయమైన బండ్లగూడ జాగీర్ వినాయక నగర్ కాలనీ



సన్‌సిటీలోని 60 ఫీట్ రోడ్డులో నిలిచిపోయిన వర్షపునీరు

భారీ వర్షం



బాలాజీనగర్ కాలనీలో ఇంటిలోకి చేరిన వరద నీరు

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలో సోమవారం మధ్యాహ్నం భారీ వర్షం కురిసింది. ఏకధాటిగా 40 నిమిషాలు కురిసిన వర్షానికి లోతట్టు ప్రాంతాలు, ప్రధాన రహదారులు జలమయమయ్యాయి. ప్రధానంగా పి.వి.నర్సింహ్మారావు ఎక్స్‌ప్రెస్‌వే పిల్లర్ 193, బెస్ట్ ప్రైజ్, శివరాంపల్లి ప్రధాన రహదారి, నేషనల్ పోలీస్ అకాడమీ, ఆరాంఘర్ రైల్వే బ్రిడ్జీ, దుర్గానగర్ చౌరస్తా, బుద్వేల్ రైల్వే బ్రిడ్జి ప్రాంతాల్లో వర్షపు నీరు రోడ్లపై నిలిచిపోవడంతో వాహనాలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. వరద నీరు రోడ్లపై నుంచి వెళ్లేందుకు దాదాపు రెండు గంటల సమయం పట్టింది. దీంతో వాహనాదారులు తీవ్ర ఇబ్బందులకు గురైయ్యారు.

బండ్లగూడ: బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి హిమాయత్‌సాగర్, కిస్మత్‌పూర్, దర్గాఖలీజ్ ఖాన్ హైదర్షాకోట్, పీరంచెరువు, బండ్లగూడ, గంధంగూడ తదితర ప్రాంతాల్లో సోమవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది.

మణికొండ: భారీ వర్షం ధాటికి లోతట్టు ప్రాంతాలు జలమయం కావటంతో పాటు అపార్ట్‌మెంట్‌లు, ఇళ్లలోకి నీరు చేరింది. ఈదురుగాలులకు చెట్లు కూలియి విద్యుత్ తీగలు తెగిపడటంతో పలు కాలనీల్లో అంధకారం నెలకొంది. మణికొండ, నార్సింగి మున్సిపాలిటీల పరిధిలో ఆదివారం రాత్రి ఏకంగా 9 సెంటీమీటర్ల భారీ వర్షం కురిసింది. మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని పంచవటి, అంజలి గార్డన్, సెక్రటేరియట్ కాలనీ, వెంకటేశ్వర కాలనీ, మణికొండ గార్డన్ కాలనీల్లోని రోడ్లు జలమయం అయ్యాయి. పంచవటి కాలనీలో కొన్ని అపార్ట్‌మెంట్‌ల సెల్లార్‌లోకి వరద నీరు చేరింది .నార్సింగి మున్సిపాలిటీ పరిధి 18వ వార్డులోని బాలాజీనగర్ కాలనీలోకి వరద నీరు చేరింది. . సోమవారం మధ్యాహ్నం మోటార్ల ద్వారా నీటిని బయటకు పంపారు. ఆయా కాలనీల్లో నాయకులు సహాయక చర్యలు చేపట్టారు.





పిల్లర్ నెంబర్ 193 వద్ద నిలిచిపోయిన వరద నీరు.. ఇబ్బందులు పడుతున్న వాహనదారులు

రహదారిపై వరదనీరు

- రాకపోకలకు ఇబ్బందులు
- దెబ్బతిన్న శంషాబాద్-షాబాద్ రోడ్డు
- పెద్దపెద్ద గుంతలతో వాహనదారుల అవస్థలు

శంషాబాద్ రూరల్: వర్షాలకు రహదారిపై వరదనీరు నిలిచిపోతుండడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని శంషాబాద్-షాబాద్ రహదారి పలుచోట్ల దెబ్బతింది. ప్రధానంగా కవేలిగూడ చౌరస్తాలో మూల మలుపు వద్ద వరదనీరు నిలిచిపోవడంతో రాకపోకలకు ఇబ్బందిగా మారింది. ఆదివారం రాత్రి కురిసిన భారీ వర్షానికి ఈ రోడ్డుపై నీరు నిలిచిపోయింది. దీంతో వాహనాలు ఒక వైపు నుంచి మాత్రమే వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. ద్విచక్ర వాహనదారులు ఈ మార్గంలో వెళ్లేందుకు నానా తంటాలు పడుతున్నారు. ఎదురెదురుగా వాహనాలు వచ్చినప్పుడు పరిస్థితి దారుణంగా మారుతోంది.

ఎందుకీ పరిస్థితి..

వరదనీరు రోడ్డుపై నిలవడానికి ప్రధాన కారణం వరదకాలువను పూడ్చివేయడమేనని స్థానికులు అంటున్నారు. రోడ్డుపై నుంచి వచ్చే వరదనీరు ఇక్కడ రహదారిపై మూలమలుపు ప్రాంతంలో దిగువకు వెళ్లి అక్కడి నుంచి ఈసీవాగులో కలుస్తోంది. అయితే ఈ వరదకాలువను పూడ్చివేయడంతో పాటు రోడ్డుకు ఇరువైపులా భారీ భవనాలు వెలిశాయి. దీంతో వరదనీటికి ఆటంకం ఏర్పడి రోడ్డుపైనే భారీగా నిలిచిపోతున్నాయి. చిన్నపాటి వాన కురిసినా రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. వర్షం కురిసిన తర్వాత వారం గడిచినా నీరు బయటకు వెళ్లడం లేదు. పైగా అక్కడ రోడ్డు బురద గుంటలా మారిపోతోంది.

నర్కూడలో..

నర్కూడ గ్రామం మధ్యలో ఉన్న ఈ రహదారిపై గోతులు ఏర్పడి వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వ పాఠశాల ఎదురుగా ఉన్న గుంతలతో నానా అవస్థలు పడాల్సి వస్తుంది. రోడ్డు మధ్యలో ఉన్న ఆలయం వెనక భాగంలో కూడా భారీ గుంతలు ఏర్పడ్డాయి. రహదారిపై వాహనదారులు పడుతున్న ఇబ్బందులను అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోవడంలేదని స్థానికులు మండిపడుతున్నారు.



కవేలిగూడ చౌరస్తాలో రహదారిపై నిలిచిన నీళ్లలో వాహనదారుల అవస్థలు

అంగరంగ వైభవంగా శ్రీనివాస కల్యాణం



రాజేంద్రనగర్: రాజేంద్రనగర్‌లోని శ్రీ వెంకటేశ్వర ఆలయంలో సోమవారం సాయంత్రం శ్రీనివాస కళ్యాణం అంగరంగ వైభవంగా జరిగింది. ఆలయ పూజారి అనంతాచార్యులు ఆధ్వర్యంలో జరిగిన కళ్యాణ వేడుకల్లో బుద్వేల్‌కు చెందిన సందీప్‌కుమార్, సంతోషి దంపతులు, శ్రీనివాస్, సుచేత దంపతులు పాల్గొన్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగు ఏర్పాట్లు చేశారు. రాజేంద్రనగర్ చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలు హాజరయ్యారు.

సమస్యలకు శాశ్వత పరిష్కార దిశగా చర్యలు



గాలిదొడ్డిలో డ్రైనేజీ సమస్యను పరిశీలిస్తున్న కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి

రాయదుర్గం: గాలిదొడ్డిలో నెలకొన్న సమస్యలకు శాశ్వత పరిష్కార దిశగా చర్యలు తీసుకుంటామని గచ్చిబౌలి కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి స్పష్టం చేశారు. సోమవారం గాలిదొడ్డిలో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ, వీధి దీపాలను ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గాలిదొడ్డిలో భూగర్భడ్రైనేజీ వ్యవస్థ మెరుగుపర్చడం, సీసీరోడ్లు, మంచినీటి సరఫరా మెరుగు, ఇతర అభివృద్ధి పనులు పూర్తి చేసేలా చూడాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా పలు సమస్యలపై అధికారులతో ఆయన ఫోన్‌లో మాట్లాడారు. కార్యక్రమంలో నార్సింగి మున్సిపల్ చైర్‌పర్సన్ రేఖాయాదగిరి, జలమండలి మేనేజర్ నరేందర్‌రెడ్డి, నాయకులు హన్మంతునాయక్, కిషన్, తిరుపతి, హరీష్‌శంకర్, శ్రీరాములు, పలువురు పాల్గొన్నారు.

గురు విశ్వస్ఫూర్తి జన్మదిన ఆరాధనోత్సవం



వేడుకల్లో ఆచార్య గౌరీశంకర్ తదితరులు

బండ్లగూడ: బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి ధ్యాన మనో ప్రస్థానంలో ఆధ్యాత్మిక విశ్వగురువు సైంటిఫిక్ సెయింట్ శ్రీ గురు విశ్వస్ఫూర్తి జన్మదిన వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్ఫూర్తి కుటుంబం ట్రస్ట్ ఆధ్వర్యంలో యువతకు ఉపయోగపడే ఆన్‌లైన్ ఫ్రీ కంప్యూటర్ క్లాసులు ప్రారంభించారు. 1600 మందికి పైగా యువత రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో తెలుగు విశ్వవిద్యాలయ మాజీ డైరెక్టర్ ఆచార్య టి. గౌరీశంకర్, ఫార్మర్ రీజినల్ కోఆర్డినేటర్ డాక్టర్ పి. శంకర్‌రావు, సైన్స్ యూనివర్స్ అధినేత రాజేంద్ర, పీఏసీఎస్ చైర్మన్ రాందాస్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

నగర వ్యాప్తంగా యమహా బైక్ లక్ష్యం

నగరంలో 6వ బ్లూ స్క్వేర్ షోరూమ్

లక్డీకాపూల్ : నగర వ్యాప్తంగా అత్యధిక ఖాతాదారులకు ప్రపంచ ఖ్యాతి చెందిన యమహా రేసింగ్ బైక్‌లను అందుబాటులోకి తీసుకురావడమే తమ లక్ష్యమని అత్తాపూర్ షోరూమ్ ఎండి తేజా చౌదరి తెలిపారు. సోమవారం అత్తాపూర్‌లో ఏర్పాటు చేసిన యమహా బ్లూ స్క్వేర్ షోరూమ్‌ను వైఎంఐఎస్ డైరెక్టర్ కవై హైటిపుమి సౌత్ జోనల్ హెడ్ టీజీ మోహన్‌రాజ్‌తో కలిసి ప్రారంభించారు.



అత్తాపూర్‌లో బ్లూ స్క్వేర్ షోరూమ్‌ను ప్రారంభిస్తున్న వైఎస్ఐఎస్ డైరెక్టర్ హైడెపున్

ముగిసిన బ్యాడ్మింటన్ పోటీలు

మణికొండ: మహిళలు ఖాళీ సమయంలో ఆటలు ఆడి ఆరోగ్యంగా ఉండాలని డెంటల్ కేర్ ఆసుపత్రి చైర్మెన్ డాక్టర్ ఎం. పద్మ అన్నారు. మణికొండ మున్సిపాలిటీ, అలకాపూర్ టౌన్‌షిప్‌లోని మ్యాచ్ పాయింట్ బ్యాడ్మింటన్ అకాడమీలో మహిళలకు వారం రోజులుగా కొనసాగుతున్న శిక్షణ, పోటీలు సోమవారం ముగిశాయి. విజేతలు జ్యోతి, అనిత, సోమవార, నేహా,సుష్మ, ప్రియాంక, లహరి, హారిక, ప్రీతి, లహరి, రమ్యలకు మెడల్‌లు, కప్‌లను ఆమె అందించారు. కార్యక్రమంలో అకాడమీ చైర్మన్ ఎం. వేణు, పిక్సా యానిమేషన్ మేకర్స్ శశికాంత్, కిరణ్‌లు పాల్గొన్నారు.



మెడల్స్ అందుకున్న మహిళలు

ఘనంగా మేడే

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలో సోమవారం మేడేను ఘనంగా నిర్వహించుకున్నారు. కార్మిక సంఘాలతో పాటు కార్మికులు, వివిధ పార్టీలకు చెందిన నాయకులు, ప్రజాప్రతినిధులు మేడే కార్యక్రమంలో పాల్గొన్నారు. కాటేదాన్, గగన్‌పహడ్, టాటానగర్ పారిశ్రామికవాడలతో పాటు రాజేంద్రనగర్, అత్తాపూర్, నౌనెంబర్, బుద్వేల్, శివరాంపల్లి, స్వప్నథియేటర్, హైదర్‌గూడ, దుర్గానగర్ ప్రాంతాల్లోని లేబర్ అడ్డాల్లో జెండాలను ఎగరవేసి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ర్యాలీలు, సభలు, సమావేశాలు నిర్వహించారు. అనంతరం సామూహిక భోజనాలు ఏర్పాటు చేశారు. ఉత్తమ కార్మికులను సన్మానించారు.ఈ వేడుకల్లో కార్పొరేటర్ అర్చనజయప్రకాష్, సంగీతగౌరీశంకర్, తోకల శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. కాటేదాన్ పారిశ్రామికవాడలో నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ హాజరయ్యారు.



ఖానాపూర్‌లో.. మేడే వేడుకల్లో కౌన్సిలర్ అమరేందర్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు



శివరాంపల్లిలో..



సాతంరాయిలో టీఆర్‌ఎస్‌వీకే ఆధ్వర్యంలో..



హైదర్షాకోట్‌లో జెండా ఆవిష్కరణలో మేయర్ మహేందర్‌గౌడ్



అత్తాపూర్‌లో జీహెచ్‌ఎంసీ కార్మికులను సన్మానించిన కార్పొరేటర్ సంగీతగౌరీశంకర్



మణికొండలో.. ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి మల్లేష్



కోకాపేటలో.. కౌన్సిలర్‌లు శివారెడ్డి, దుర్గేష్‌యాదవ్, విజయ్‌బాబులు

నియమాలు తప్పనిసరిగా పాటించాలి

బండ్లగూడ: బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని శ్రీ శారదాధామంలో నూతన ఆచార్యుల శిక్షణ కార్యక్రమాన్ని సోమవారం ప్రారంభించారు. శ్రీ సరస్వతీ విద్యాపీఠం పాలక మండలి సభ్యులు డాక్టర్ అన్నదానం సుబ్రహ్మణ్యం ముఖ్య అతిధిగా హాజరై ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంస్కార ప్రక్రియలో మన దైన వ్యవస్థలో నియమాలు పాటించే విధంగా అలవాటు చేసుకోవాలన్నారు. శిశు మందిరాలు సమాజంలో శక్తివంతమైన శిశు మందిరాలుగా నిర్మాణం కావాలన్నారు. వీటికి మూలాధారం ఆచార్యుడే అన్నారు.కార్యక్రమంలో సరస్వతీ విద్యాపీఠం తెలంగాణ అధ్యక్షులు తిరుపతిరావు, సంఘటనా కార్యదర్శి శ్రీనివాస్‌రావు పాల్గొన్నారు.

పీవీ ఎక్స్‌ప్రెస్‌వేపై కారు బోల్తా



రాజేంద్రనగర్: పి.వి.నర్సింహారావు ఎక్స్‌ప్రెస్‌వేపై ఓ కారు బోల్తాపడడంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడ్డాయి. సోమవారం ఉదయం శంషాబాద్ నుంచి మెహిదీపట్నం వైపు వెళ్తున్న కారు పిల్లర్ నెంబర్ 315 వద్ద బోల్తా కొట్టింది.ఆ సమయంలో కారులో ఇద్దరు ప్రయాణిస్తున్నారు. బెలూన్‌లు తెరుచుకోవడంతో చిన్నపాటి గాయాలతో ఇరువురు బయటపడ్డారు. ఈ దారి గుండా వెళ్తున్న వారు వీరిని బయటకు తీశారు. దాదాపు ఈ రహదారిపై 45 నిమిషాల పాటు వాహనాలకు ఇబ్బందులు ఏర్పడ్డాయి. ప్రమాదం విషయమై ఫిర్యాదు అందలేదని రాజేంద్రనగర్ పోలీసులు వెల్లడించారు.